క్లుప్తంగా

అన్న ప్రసాద వితరణ



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కొడంగల్: మహాశివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్ష చేసిన భక్తులకు శనివారం ఉదయం స్థానిక గాడిబాయి శివాలయంలో అన్న ప్రసాదం పంపిణీ చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉపవాస దీక్షలు చేసిన భక్తులు.. దేవుని సన్నిధిలో దీక్ష విరమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.. లింగమయ్యకు పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకుడు కిట్టుస్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇందులో రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, నరేష్‌గౌడ్, ఊట్కూర్ రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు



పాత కొడంగల్‌లో నీటితొట్టి దుస్థితి

కొడంగల్: మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. వేసవిలో వీటిల్లో నీటిని నింపితే పశు పక్షాదులకు ఉపయోగపడుతుందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో తొట్లను నిర్మించారు. అయితే తొట్లలో పంచాయతీ సిబ్బంది నీటిని నింపాల్సి ఉంటుంది. కానీ.. వారి నిర్లక్ష్యం కారణంగా అవి వృథాగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ వేసి, తొట్లకు నీటిని సరఫరా చేస్తే పశువుల తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ఓంకారేశ్వర ఉత్సవాలు



భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

కుల్కచర్ల: మండల పరిధి మందిపల్ గ్రామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న శ్రీ ఓంకారేశ్వర స్వామి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మందిపల్ మాజీ సర్పంచ్ మఠం ప్రమీల, ఆలయ ప్రధాన అర్చకులు మఠం రాజశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి లింగోద్భవ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ధారూరు: కపిలేశ్వరస్వామికి శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు లింగోద్భవ పూజలు నిర్వహించారు. పూజారి చెన్నబసవయ్యస్వామి ఆధ్వర్యంలో భక్తులు శివలింగంకు పంచామృతం, పాలు, జలంతో అభిషేకం చేశారు. పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించి హారతి ఇచ్చారు. ఈ పూజా కార్యక్రమాన్ని శెట్టి శివానందం, ఆయన కుమారులు దంపతులతో కలిసి నిర్వహించారు.

రేపు అవగాహన సదస్సు

అనంతగిరి: జూన్ చివరి వారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్ష నిమిత్తం సోమవారం వికారాబాద్‌లోని ఏకేఆర్ స్టడీ సర్కిల్‌లో.. అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షల నిపుణలతో సూచనలు, సలహాలు ఇస్తామని వెల్లడించారు. కావున ఎస్‌జీటీ, ఎస్‌ఏ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమణ సూచించారు.

‘చేవెళ్ల’లో కాంగ్రెస్‌దే విజయం

తాండూరు: కాంగ్రెస్ పార్టీకి యువతే వెన్నెముక అని యూత్ కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కృష్ణంరాజు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి సంపత్ అధ్యక్షతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సతీష్‌రెడ్డి, ఆమేర్ అబ్దుల్లా సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పట్టుదల ఉంటే.. ఫలితం మీదే..

- కష్టంగా కాకుండా ఇష్టంగా చదవండి
- వార్షిక పరీక్షలకు మిగిలింది ఎనిమిది రోజులే
- పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు



ప్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

దౌల్తాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18న ప్రారంభం కానున్నాయి. ఇక మిగిలింది 8 రోజులే గడువే. ఇప్పటి వరకు చదివింది ఒక లెక్క. ఇకమీదట మరో లెక్క. ఈ స్వల్పకాలం.. టెన్త్ విద్యార్థులకు కీలకం కానుంది. కష్టంగా భావించే ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో పే చేయి సాధించడానికి కుస్తీ పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. అదే సమయంలో ఇష్టంగా చదవాలని సూచిస్తున్నారు.

బట్టీ పట్టొద్దు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఇప్పటికే పది విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఏ సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చాయో బేరీజు వేసుకుని, వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పాఠాలను బట్టీ పట్టినట్లు కాకుండా.. ఆయా అంశాలపై అవగాహన కలిగేలా శ్రద్ధతో చదివితే ఫలితం ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఒత్తిడిని జయించాలి

‘పరీక్షలు రాసేటప్పుడు ఎలాంటి టోన్షన్‌కు లోనుకావొద్దు. పాఠశాలల్లోనే రాసిన పరీక్షలుగా భావించి ఒత్తిడిని దూరం చేసుకోవాలి. పట్టుదలతో ఉంటూ.. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించాలి. అప్పుడే మెరుగైన ఫలితాలు మీ సొంతం అవుతాయి’ అని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచిస్తున్నారు. అంతే కాకుండా.. ఉదయం 5గంటలకు లేచి, ప్రశాంత వాతావరణంలో చదివితే మంచిదని, కీలక అంశాలను ఎప్పటికప్పుడు నోట్స్‌గా రాస్తే.. పాయింట్ల వారీగా పరీక్షల్లో రాసేందుకు అవకాశముంటుందని వెల్లడిస్తున్నారు.

బ్లాక్‌స్పాట్!

- ప్రమాదకరంగా మలుపు
- వారం రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు



ప్రమాదకరంగా మారిన మలుపు



మలుపు వద్ద బోల్తాపడిన డీసీఎం

యాలాల: ముద్దాయిపేట మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. వారం రోజుల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగి బ్లాక్ స్పాట్!గా గుర్తింపుపొందింది. అదృష్టవశాత్తు ఈ ఘటనల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగక పోయినప్పటికీ.. ఆస్తి నష్టం సంభవించింది. మండల పరిధి ముద్దాయి పేట నుంచి బొంరాస్‌పేట వెళ్లే మార్గం ఈర్గా సమీపంలో గల భారీ మలుపు ప్రమాదకరంగా తయారైయింది. ఈ మార్గం గుండా ఎవరైనా కొత్తవారు ప్రయాణిస్తే.. దగ్గరికి వచ్చే వరకు ఇక్కడో మలుపు ఉన్నతి సంగతి వారికి తెలియదు. తాజాగా శనివారం ఉదయం ఈ మార్గంలో వెళ్తున్న ఓ స్క్రాప్ డీసీఎం అదే మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది.

కనిపించని సూచికలు

రెండేళ్ల క్రితం రహదారిని విస్తరించారు. దీంతో ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలు పెరిగాయి. తాండూరు నుంచి హైదరాబాద్, షాద్‌నగర్ వెళ్లే వాహనదారులు ఈ రోడ్డునే ఎంచుకుంటున్నారు. అయితే వాహనాల రద్దీ పెరిగినప్పటికీ.. సంబంధిత అధికారులు మూలమలుపు ఉన్నచోట్ల ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. ఇది వాహనదారుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికైనా మలుపు ప్రదేశంలో రేడియం స్టికర్లు, లేదా హెచ్చరిక బోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, వాహనదారులు కోరుతున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: మండల పరిధి మిట్టబాసుపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ శ్రేణులు సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద గ్రామానికి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. గ్రామంలోని పంచాయతీ భవనం నుంచి కరన్‌కోట్ నాగప్పతో పాటు వాటర్ ట్యాంక్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెద్ద నర్సింహులు, మల్లప్ప, ఇస్మాయిల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీష్, నాయకులు లక్ష్మారెడ్డి, పెద్ద ఇస్మాయిల్, రాఘవేం దర్‌రెడ్డి, గోవింద్, చిన్న నర్సింహులు, తలారి రాములు, రామప్పలు ఉన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వైభవంగా.. శివపార్వతుల కల్యాణం



బుగ్గ రామేశ్వరాలయంలో కల్యాణం చేయిస్తున్న దంపతులు

అనంతగిరి: పీరంపల్లి గ్రామం బుగ్గ రామలింగేశ్వరాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన చేవెళ్ల జనార్దన్‌రెడ్డి దంపతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక హారతి ఇచ్చి అన్నదానం చేశారు.

తాండూరు గోశాల నూతన కమిటీ ఎన్నిక

తాండూరు టౌన్: తాండూరు గోశాల సేవా సమితి నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పట్లోళ్ల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మన్మోహన్ సార్డా, లింగదల్లి రవికుమార్, ప్రధాన కార్యదర్శి కొత్రిక కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శులు కిషోర్ పటేల్, సిరిగిరిపేట్ రమేష్, కోశాధికారి సంజయ్ సార్డా, లీగల్ అడ్వైజర్ పంజుగుల గుండప్ప, కార్యవర్గ సభ్యులుగా శెట్టి రమేష్, గోపాలకృష్ణ బాగ్రే, వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్, ఓంప్రకాష్ సోమాని, మల్లికార్జున, నరేందర్ గౌడ్, విష్ణు రామ్ చౌదరి, బాలాజీ వెంకట్‌లను నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ..కార్యవర్గం రెండేళ్ల పాటు సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.

రేపు ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా

తాండూరు టౌన్: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల వేతన బకాయిలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ, తెలంగాణ జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏడు నెలలుగా ఇవ్వని వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. జీఓ నంబర్ 60 ప్రకారం కార్మికులకు జీతాలు పెంచాలని, రూ.5లక్షల బీమా కోసం విధి విధానాలను రూపొందించాలన్నారు. రేపు చేపట్టే ధర్నాకు కార్మికులు తరలిరావాలని పిలుపు నిచ్చారు.

హిందూధర్మ పరిరక్షణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరయోగి

కుల్కచర్ల: హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి అన్నారు. మహాశివరాత్రి జాగరణను పురస్కరించుకుని బండవెల్కిచర్ల శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో పరిగి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హిందువులకు ఎక్కడో ఏదో జరిగిందని, మన వద్ద కాదు కదా, మనకెందుకులే అనే భావనతో ఉండటం వలన నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమాజంలో జరుగుతున్న మంచిచెడులను తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. భక్తి భావాన్ని అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత నెలకొంటుందని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పరిగి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, ఆలయ చైర్మన్ నర్సింహరాములు, ఎంపీటీసీ జ్యోతి, ఏబీవీపీ నాయకులు వార్ల సాయికిరణ్ గౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తప్పన్నందుకు దాడి..

- ఆపై కులం పేరుతో దూషించారని ఫిర్యాదు
- బహిరంగ విచారణలో వివరాలు వెల్లడించిన పోలీసులు



విచారణ జరుపుతున్న సీఐ, ఎస్‌ఐలు

ధారూరు: రోడ్డును ఆక్రమించుకుని ఇంటిని కడుతున్నావని అడిగినందుకు.. సదరు వ్యక్తి తనను కులం పేరుతో దూషించారని ఓ మహిళ ఫిర్యాదు చేయగా.. పోలీసులు బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సంఘటన శనివారం మండల పరిధి హరిదాస్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమృతమ్మ, మరో వ్యక్తి పెంటయ్యలు.. రాజేందర్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద గతంలో నివాస స్థలం కొనుగోలు చేశారు. తనకు చెందిన స్థలంలో అమృతమ్మ.. ఇంటిని నిర్మిస్తోంది. ఈ క్రమంలో పెంటయ్య అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తంచేశారు. రోడ్డును ఆక్రమించుకొని ఇటిని నిర్మిస్తున్నారని, తద్వారా తాను రోడ్డును కోల్పోతున్నట్లు వాపోయారు. ఇదే విషయమై.. స్థలం విక్రయించిన వ్యక్తిని పెంటయ్య సంప్రదించగా.. సదరు వ్యక్తి నిర్మాణంలో ఉన్న ఇంటిని పరిశీలించారు. రోడ్డును ఆక్రమించుకున్నది వాస్తవమేనని, ఇది తప్పని వారించాడు. ఎంపీఓ షఫీఉల్లా, గ్రామ కార్యదర్శికి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వారిరువురు నిర్మాణంలో ఇంటి స్థలాన్ని మేజర్‌మెంట్(కొలతలు) చేసి రోడ్డును ఆక్రమించినట్లు తేల్చారు. ఇది తప్పని నిర్మాణంలో ఉన్న ఇంటి యజమాని అమృతమ్మకు చెప్పారు. దీంతో అమృతమ్మ, ఆమె కొడుకు రాజు, స్థలం విక్రయించిన వ్యక్తి రాజేందర్‌రెడ్డిపై దాడి చేశారు. అతడి బైక్‌ను ధ్వంసం చేశారు. అంతే కాకుండా కులం పేరుతో రాజేందర్‌రెడ్డి తమను దూషించాడని అమృతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు శనివారం బహిరంగ విచారణ చేపట్టగా.. అక్రమ నిర్మాణం గురించి.. అడిగిన రాజేందర్‌రెడ్డి, పెంటయ్య కుటుంబీకులపై అమృతమ్మ, ఆమె కుటుంబీకులు దాడిచేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. రాజేందర్‌రెడ్డి కులం పేరుతో ఎవరినీ దూషించలేదని నిర్ధారించారు.

ధరణి సమస్యల పరిష్కారానికి కృషి



మొయినాబాద్: దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

శంకర్‌పల్లి: మండల పరిధి గ్రామాల్లో నిర్వహించిన ధరణి స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామని శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ పేర్కొన్నారు. మొత్తం 3వేల వరకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో 300వరకు పరిష్కరించారని తెలిపారు.

కొత్తూరులో..

కొత్తూరు: ధరణిలో నెలకొన్న సమస్యల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన దరఖాస్తుల స్వీకరణశనివారంతో ముగిసింది. కొత్తూరు మండలంలో 511 చేయగా రెవెన్యూ అధికారులు 120 పరిష్కరించారు. మిగిలిన వాటికి మరికొంత సమయం పట్టనున్నట్లు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

షాబాద్‌లో..

షాబాద్: పెండింగ్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించిందని తహసీల్దార్ ఎండీ అన్వర్ పేర్కొన్నారు. మొత్తం దరఖాస్తులు 1,580 ఉండగ అందులో 580 పరిష్కరించిన్నట్లు తెలిపారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: సుమారు 25 శాతం మాత్రమే రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ నెల 1 నుంచి 9 వరకు రెవెన్యూ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి పరిశీలించారు. మొత్తం 2,246 దరఖాస్తులుండగా అందులో 571 పరిశీలించారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఆర్‌ఐలు చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే టోర్నమెంట్

చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల: ప్రతిభను వెలికి తీసేందుకే టోర్నమెంట్‌లు దోహదపడతాయని సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్ కుమార్‌లు పేర్కొన్నారు. దామరగిద్ద గ్రామంలో శనివారం బోడ అనిల్‌కుమార్ స్మారకార్థం జిల్లా స్థాయి, ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని చెప్పారు. యువత ఖాళీగా ఉండకుండా వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, మాజీ సర్పంచులు ఆర్ మధుసూదన్‌గుప్తా, ఎం. వెంకటేశంగుప్తా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చీలం ప్రతాప్‌రెడ్డి, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు ఎం. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీ ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్

15న ఎమ్మార్పీఎస్ సదస్సు

చేవెళ్ల: ఈ నెల 15న చేవెళ్లలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మదిలేటి మాదిగ తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో శనివారం జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు మాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సమావేశం జరుగుతుందని, దీనికి మంద కృష్ణమాదిగ రానున్నట్లు తెలిపారు.

పచ్చదనం కనుమరుగు




దౌల్తాబాద్ రిజర్వ్ ఫారెస్టులో ఎండిన చెట్లు

బోసిపోయిన అరణ్యం

కొడంగల్: వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతుండటంతో మొక్కలు, మానువులు మాడిపోతున్నాయి. దీంతో అడవులు పల్చబడి బోసిపోతున్నాయి. నియోజకవర్గ పరిధి అటవీ ప్రాంతంలో చెట్లు ఎండిపోతున్నాయి. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని రిజర్వ్ ఫారెస్టులతో పాటు అడవుల్లోని చెట్లు, మొక్కలు ఎండ తీవ్రతకు, నీటి లభ్యత తగ్గి ఆకులు రాలి, మోడుబారిపోయాయి. దౌల్తాబాద్ రిజర్వ్ ఫారెస్టు, తిరుమలాపురం అడవి, సిద్ధనొంపు, బొంరాస్‌పేట అటవీ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి. దీంతో అడవి తల్లి బోసిపోయినట్లు కనిపిస్తోంది.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం


ప్రకటించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొకట్ మాధవరెడ్డి



దోమ: అనంతయ్య



ధారూరు: రమేశ్



వికారాబాద్: శ్రీదేవి



పరిగి: బాలకృష్ణారెడ్డి

దోమ/ధారూరు/అనంతగిరి/పరిగి: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ.. మండల స్థాయిలో బీజేపీ అధ్యక్షుల మార్పునకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శనివారం పలు మండలాలు, పరిగి పట్టణానికి అధ్యక్షులను, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా వికారాబాద్‌కు చెందిన కౌన్సిలర్‌ను నియమిస్తూ ప్రకటించింది. దోమ మండల అధ్యక్షుడిగా మోత్కూర్ గ్రామానికి పోరల అనంతయ్యను ఎనుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొకట్ మాధవరెడ్డి తెలిపారు. గతంలో పనిచేసిన శేరిరాంరెడ్డి పదవీ కాలం ముగియడంతో అనంతయ్యను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడారు. తనను నమ్మి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

ధారూరుకు రమేశ్..

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎం.రమేశ్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ప్రకటించారు. గతంలో పనిచేసిన అనుభవం ఉన్నందునే రమేష్‌ను తిరిగి ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. పార్టీ తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా శ్రీదేవి

వికారాబాద్ మున్సిపాలిటీ 24వ వార్డు బీజేపీ కౌన్సిలర్ తాడిగెల శ్రీదేవిని.. పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గసభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మహిళామోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డికి, అందుకు సహకరించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిగి పట్టణ అధ్యక్షుడిగా..

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా న్యాయవాది బాలకృష్ణారెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి.. నియామకపత్రం అందజేశారు. గతంలో జిల్లా బాడిలో, బజరంగ్‌దళ్‌లో పనిచేసి, పార్టీ అభ్యున్నతికి కృషి చేసినందుకు.. అధిష్టానం పట్టణ అధ్యక్షుడిగా ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యున్నతి పాటుపడతానని ఆయన చెప్పారు.

యాలాలకు యాదగిరి

యాలాల: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా జంగం యాదగిరిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. గతంలో అధ్యక్షుడిగా కొనసాగిన మహిపాల్.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఈ బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. తాజాగా యాదగిరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.